

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.14

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.14 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
39.4°/20.9°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పోలీసు సిబ్బంది సంక్షేమమే ధ్యేయం



సమీక్ష చేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం:పోలీసు సిబ్బంది,వారి కుటుంబ సభ్యుల సంక్షేమమే ధ్యేయమని జిల్లా ఎస్పీ కేకే ఎన్ అన్బురాజన్ అన్నారు. పోలీసు సిబ్బంది కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను బుధవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఇంకా ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలనే దానిపై చర్చించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్. విజయభాస్కర్ రెడ్డి (పరిపాలన), ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్. లక్ష్మీ నారాయణ రెడ్డి, ఎస్బీ సీఐలు ఇందిర, జాకీర్ హుస్సేన్, ఆర్ఐలు రాముడు, రెడ్డప్ప రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరి నాథ్, తేజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

892 మంది విద్యార్థుల గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన మొదటి సంవత్సరం గణితం-1, బాటనీ-1, సివిక్స్-1 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 892 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 24,478 మందికి గాను 23,690 మంది హాజరయ్యారు. 787 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,176 మందికి గాను 2,071 మంది హాజరయ్యారు. 105 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ రెండు కేంద్రాలు, డీఈసీ సభ్యులు నాలుగు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 9 కేంద్రాలను తనిఖీ చేశాయి. నాలుగు కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు.

సింహ వాహనంపై రామలింగేశ్వరుడి విహారం



తాడిపత్రి అర్బన్: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం బుగ్గరామలింగేశ్వరుడు సింహ వాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం గర్భాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సామూహిక యాగం చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చి సింహ వాహనంపై అధిష్టింపజేశారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పట్టణ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు.

వైద్యసేవలకు వందనం

- తాడిపత్రిలో రూ.24 కోట్ల వ్యయంతో వందపడకల ఆస్పత్రి ఏర్పాటు
- వైఎస్సార్ హయాంలో శంకుస్థాపన
- పట్టించుకోని గత టీడీపీ ప్రభుత్వం
- సీఎం వైఎస్ జగన్ చొరవతో శరవేగంగా పూర్తయిన పనులు
- నేటి నుంచి వైద్యసేవలు ప్రారంభం
- మూడు జిల్లాల ప్రజలకు అందనున్న నాణ్యమైన సేవలు



తాడిపత్రిలో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆస్పత్రి

తాడిపత్రి రూరల్: మూడు జిల్లాల సరిహద్దు గ్రామ ప్రజల దశాబ్దాల కల సాకారమైంది. రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి ప్రారంభానికి ముస్తాబైంది. గురువారం ఆస్పతిని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. గురువారం నుంచి ఆస్పత్రిలో వైద్యసేవలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చొరవను తాడిపత్రి వాసులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వంద పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం ఉదయం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు.

సీఎం వైఎస్ జగన్ చొరవతో పూర్తి

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2009లో తాడిపత్రిలో శంకుస్థాపన చేసిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి అనువైన స్థలం లేదంటూ అప్పటి తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ దివాకర్‌రెడ్డి వాయిదాలు వేస్తూ వచ్చారు. స్థలం కోసం గాలిస్తున్నామంటూనే కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆస్పత్రి నిర్మాణానికి మంజూరైన నిధులు మరిగిపోయాయి. 2014 ఎన్నికల సమయంలో జేసీ సోదరులు టీడీపీలో చేరారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన జేసీ ప్రభాకరరెడ్డి సైతం వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి నిర్లక్ష్యం చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 30 పడకల ఆస్పత్రిని వంద పడకలకు పెంచేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఆస్పత్రి ఉన్న ప్రాంతంలోనే వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ఇంజినీర్లతో ప్లాన్ సిద్ధం చేయించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపాదనలు అందుకున్న రోజుల వ్యవధిలోనే ఆస్పత్రి నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిధులు మంజూరు చేశారు. మొత్తం రూ.24 కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాల సరిహద్దు ప్రాంతంగా తాడిపత్రి ఉండడంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా క్షతగాత్రులను వెంటనే ఇక్కడి ఆస్పత్రికి తీసుకురావడం పరిపాటిగా మారింది. అయితే ఇంత కాలం రోగులకు ప్రథమ చికిత్స నిర్వహించి ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తూ వచ్చారు. ప్రస్తుతం అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరడంతో అత్యవసర వైద్య సేవలు కూడా ఇక్కడే అందుతాయని వైద్యులు అంటున్నారు.

జేసీ బ్రదర్స్ చేయలేనిది చేసి చూపించాం



నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో జేసీ సోదరులు చేయలేని అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన ఈ ఐదేళ్లలో చేసి చూపించాం. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిని వంద పడకలకు పెంచేలా చర్యలు తీసుకున్నాం. నివేదికలు సిద్ధం చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే ఆయన స్పందించి రూ.24 కోట్ల నిధులు ఇచ్చారు. పనులు వేగవంతం చేసి, ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి

సరిహద్దుల్లో నిఘా పెంచండి

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంతో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో కలిసి అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారులతో గూగుల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో రౌడీషీటర్లను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అనుమానితుల వివరాలు నమోదు చేయాలన్నారు. కర్ణాటకలోని సరిహద్దు జిల్లాల అధికారులు సహకారం అందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. గూగుల్ మీట్‌లో కర్నూలు, బళ్లారి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

అసంతృప్త నేతలకు పదవులతో ఎర

శింగనమల: పదవులతో ఎర వేసి అసంతృప్తులను చల్లార్చేందుకు టీడీపీ నేతలు చర్యలు తీసుకున్నారు. ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా బండారు శ్రావణి పేరు ప్రకటించడంతో అసమ్మతి భగ్గుమంది. ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. శ్రావణికి మద్దతుగా ప్రచారం చేయలేమని పార్టీ అధినేత చంద్రబాబు వద్దే తెగేసి చెప్పి వచ్చారు. ఈ క్రమంలోనే ముంటిమడుగు కేశవరెడ్డి వద్దకు బండారు శ్రావణి వెళ్లారు. 'నీ విజయం కోసమైతే పని చేయం, ఓడించేందుకే ప్రయత్నం చేస్తాం' అని శ్రావణి ముఖంమీదే ఆయన చెప్పేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ క్రమంలోనే ఆయా నేతలకు పదవులు కట్టబెట్టడం గమనార్హం. ఆలం నరసానాయుడును టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, మాజీ జెడ్పీటీసీ రామలింగా రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు.

నియమాలపై అవగాహన తప్పనిసరి

- కలెక్టర్ గౌతమి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి కోడ్ అమలులోకి వస్తుందన్నారు. ఆ సమయంలో ఏం చేయాలి, ఏం చేయకూడదు అనే అంశాలపై పూర్తి స్పష్టత అవసరమన్నారు. అభ్యర్థులు ఏ క్రమంలోనూ కోడ్ ఉల్లంఘించకూడదన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, సూచనలు, నిబంధనలపై సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉన్న వారిని పోలింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలని సూచించారు. ఈవీఎంలు, మాక్‌పోల్, ప్రొసీజర్స్, పోలింగ్ రోజున ఏం చేయాలనే దానిపై ఏజెంట్లు పూర్తి స్పష్టతతో ఉండాలన్నారు. ఈవీఎంలో ఓటు వేసే విధానంపై గ్రామ పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్‌తో పాటు సోషల్ మీడియా సెల్, మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ఖర్చుకు సంబంధించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. పార్లమెంట్ నియజకవర్గానికి రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.40 లక్షలు మాత్రమే అభ్యర్థులు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ర్యాలీలు, సభలు, హోర్డింగ్‌లు, భోజనాలు, తదితర వాటికి ఎంత ఖర్చు చేస్తున్నారనేది రేట్ చార్ట్ ఫిక్స్ చేస్తారన్నారు. ఈ అంశం చాలా సున్నితమైందన్నారు.

ఓటర్లను ప్రలోభపెట్టరాదు

ఎన్నికల్లో ఓటర్లను ఏ విధంగానూ ప్రలోభపెట్టరాదని కలెక్టర్ గౌతమి అన్నారు. మద్యం, డబ్బు, వస్తువులు, తదితర వాటి పంపిణీ జరగకూడదన్నారు. ప్రచార సమయంలో గొడవలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ప్రత్యర్థులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడరాదన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను బలోపేతం చేశామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన సువిధ, సి-విజిల్, ఐటీ అప్లికేషన్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డీసీఓ ప్రభాకర్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి కుష్బూ కోఠారి, ఉద్యాన శాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, పార్టీల ప్రతినిధులు కేవీరమణ, పవన్‌కుమార్, ఈశ్వర్‌ప్రసాద్, ఇమామ్,శర్మాస్‌వలి, మసూద్‌వలి, అంజయ్య, బాలరంగయ్య, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు రాజ్యాధికారం

- పెద్ద ఎత్తున పదవులు ఇచ్చి బలమైన వర్గాలుగా తీర్చిదిద్దారు
- ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు నాటకాలు
- బీసీ డిక్లరేషన్ అంటూ మళ్లీ వంచించేందుకు పన్నాగం
- వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకర్ నారాయణ



మాట్లాడుతున్న మాలగుండ్ల శంకర్ నారాయణ, చిత్రంలో రమేష్ గౌడ్, పామిడి వీరా, శ్రీనివాసులు

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమైందని వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త మాలగుండ్ల శంకర్ నారాయణ అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున పదవులు ఇచ్చి బలమైన వర్గాలుగా తీర్చిదిద్దారని కొనియాడారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కేబినెట్‌లో 25 మందికి గానూ 11 మంది బీసీలకు అవకాశం కల్పించిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 మంది మున్సిపల్ చైర్మన్లు ఉంటే అందులో 44 మంది బీసీలేనన్నారు. 14 మేయర్ పోస్టుల్లో 9 మంది, 13 జెడ్పీ చైర్మన్లలో ఆరుగురు, 44 మంది శాసన మండలి సభ్యుల్లో 30 మంది, 637 ఎంపీపీలలో 237 మంది బీసీలకు అవకాశం కల్పించారన్నారు. ఇదే కాకుండా, 135 కార్పొరేషన్లలో 55 కార్పొరేషన్లకు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే చైర్మన్లుగా ఉన్నారన్నారు. బడుగులు అగ్రవర్ణాలతో సమానంగా ఎదగాలన్న మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కలలను సీఎం జగన్ సాకారం చేశారన్నారు. 'నవరత్నాల'లో భాగంగా రూ.2.55 లక్షల కోట్లు విడుదల చేస్తే, అందులో రూ.1.26 లక్షల కోట్లు బీసీలకే అందాయన్నారు. బీసీల సంక్షేమానికి ఎంతగా పెద్ద పీట వేశారో దీన్ని బట్టే అర్థమైపోతుందన్నారు.

మళ్లీ వంచించేందుకు బాబు కుయుక్తులు

టీడీపీ అధినేత చంద్రబాబు బీసీ సామాజిక వర్గాల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదని శంకరనారాయణ విమర్శించారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకున్నారని దుయ్యబట్టారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో నాటకాలకు తెరలేపారన్నారు. 26 వేల మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించారంటూ అవాస్తవాలు ప్రచారం చేశారన్నారు. బీసీ డిక్లరేషన్ అంటూ మళ్లీ వంచించేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలోనే గీత, చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ అందించే కార్యక్రమానికి బీజం పడిందని, నేడు తానేదో కొత్తగా ఇస్తామన్నట్లు ప్రకటించడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. అలాంటి వ్యక్తికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వంత పాడుతుండడం హేయమన్నారు. టీడీపీ పాలనలో బీసీల కోసం ఎంత ఖర్చు చేశారు, తమ ప్రభుత్వంలో ఎంత మేలు చేశాం అనే అంశంపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. చంద్రబాబు మోసాలను పసిగట్టిన బీసీలు 2019 ఎన్నికల్లో బుద్ధి చెప్పారని, మళ్లీ ప్రజాకోర్టులో ఆయనకు గుణ పాఠం తప్పదని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో 110 హామీలను ఇచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. బీసీలు జడ్జిలుగా పనికిరారంటూ సుప్రీంకోర్టు కొలీజియానికే లేఖ రాసిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. టీడీపీ ప్రకటించిన 94 సీట్లలో కేవలం 18 మాత్రమే బీసీలకు కేటాయించారంటేనే ఆయనకు వారిపై ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ బీసీలకు రాజ్యాధికారం కల్పించారని,రానున్న ఎన్నికల్లో బీసీలంతా వైఎస్సార్‌సీపీవైపే ఉంటారని స్పష్టం చేశారు. సమావేశంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, కార్పొరేటర్ శ్రీనివాసులు, పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వ భరోసా

- నకాలంలో పంట నష్టపరిహారం
- గత ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు రూ.251 కోట్ల పరిహారం
- 1.69 లక్షల మంది రైతులకు లబ్ధి



మెగా చెక్కు విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, తదితరులు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా భరోసా కల్పిస్తోందని కలెక్టర్ ఎం.గౌతమి, జిలా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి అన్నారు. గత ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారాన్ని బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విడుదల చేశారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌తో పాటు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ సీజన్‌లో పంట నష్టానికి అదే సీజన్‌లో పరిహారం అందిస్తూ రైతుల్లో ఆత్మ స్థైర్యం నింపుతున్నారన్నారు. విత్తనం మొదలు పంట విక్రయం వరకు రైతుల చెంతకే ప్రభుత్వ సేవలు తీసుకెళ్లారన్నారు. గత ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా జిల్లాలో 28 మండలాలను కరువు జాబితాలో ప్రభుత్వం చేర్చిందన్నారు. 1,79,815 హెక్టార్లలో 1,69,970 మంది రైతులకు సంబంధించి పంట నష్టపరిహారం రూ.251.21 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లోకి జమచేశారన్నారు. అనంతరం మెగా చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు సుబ్బారెడ్డి, వన్నూరమ్మ, కాంతారెడ్డి, పెద్దిరెడి, తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేదు..



6 ఎకరాల్లో చీనీ పంట సాగుచేసి నష్టపోయా. ఇందుకు రూ.లక్ష పరిహారం అందింది. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్‌లో పరిహారం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. రైతుల కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నారు. ఉచిత బీమా, రైతు భరోసాతో ఆదుకుంటూనే సీహెచ్ గ్రూపులకు ట్రాక్టర్లు ఇస్తున్నారు. ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి, పంటసాగు నుంచి విక్రయం వరకు రైతులకు ప్రభుత్వం తోడుగా నిలుస్తోంది.

– శంకరరెడ్డి, రైతు, కమలాపురం, గార్లదిన్నె మండలం

భగభగలు.. మొదలు..





అనంతపురంలో ఎండలో వాహనదారుల అవస్థలు, చెట్ల కింద సేదతీరుతున్న బాలికలు



గొడుగు రక్షణలో ముందుకు సాగుతూ..

అనంతపురం అగ్రికల్చర్: వేసవి ఆరంభంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఈ సీజన్‌లో తొలిసారిగా విడపనకల్లు మండలంలో మంగళవారం 40.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం కూడా చాలా మండలాల్లో 39 డిగ్రీలకు పైబడి నమోదయ్యాయి. గత వారం రోజులుగా జిల్లా అంతటా పగటి ఉష్ణోగ్రతలు బాగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా 20 నుంచి 25 డిగ్రీల వరకు ఉండటంతో ఉక్కపోత మొదలైంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత కనిపిస్తోంది. విడపనకల్లుతో పాటు కూడేరులో కూడా మంగళవారం 40 డిగ్రీలు నమోదు కాగా, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, శెట్టూరు, గుంతకల్లు, శింగనమల, యల్లనూరు, అనంతపురం, కణేకల్లు, నార్పల తదితర మండలాల్లో 39 డిగ్రీలపై పైగా నమోదయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని పరిగి, చెన్నేకొత్తపల్లిలో మంగళవారం గరిష్టంగా 39.9 డిగ్రీలు నమోదైంది. కొత్తచెరువు, కనగానపల్లి, రొద్దం, రామగిరి, ధర్మవరం, కదిరి, అమరాపురం, ముదిగుబ్బ తదితర మండలాల్లో కూడా 39 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఈ వేసవిలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరికలు కూడా జారీ చేయడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో తీవ్రత అధికంగా ఉండే ప్రమాదం ఉన్నందున రైతులు, కూలీలు, ఫుట్‌పాత్ వ్యాపారులు, వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.మంచినీళ్లు, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్, కర్బూజా, కళింగర, ఇతరత్రా పండ్ల రసాలు అధికంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని చెబుతున్నారు.

క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న విశ్వ



సహాయక చర్యల్లో నిమగ్నమైన మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చేలా చర్యలు తీసుకుని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలు... బుధవారం ఉదయం ఉరవకొండ నుంచి వజ్రకరూరుకు బయలుదేరిన విశ్వ... మార్గ మధ్యంలో మార్కెట్ యార్డు వద్ద ఆటో బోల్తాపడిన విషయాన్ని గమనించి తన వాహనాన్ని ఆపి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాతులను ఆటో ఎక్కించి ఆస్పత్రికి చేర్చారు. క్షతగాత్రులను కూడేరు మండలం కరుట్లపల్లికి చెందిన కుటుంబ సభ్యులుగా గుర్తించారు. వీరు నుంచి వజ్రకరూరు మండలం పందికుంట గ్రామానికి ఆటోలో వెళుతుండగా మార్కెట్ యార్డు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది.

మహిళ ఆత్మహత్య



కాంతమ్మ (ఫైల్)

తాడిపత్రి: జీవితంపై విరక్తితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని కృష్ణాపురం రెండవ రోడ్డులో నివాసముంటున్న కొట్టి కాంతమ్మ (58) కొంత కాలంగా ఉదర సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె బుధవారం తెల్లవారుజామున తాడిపత్రి – చల్లవారిపల్లి మధ్య పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కాంతమ్మ భర్త కొండారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ముగ్గురికి జైలు శిక్ష

గార్లదిన్నె: భూ వివాదాలకు సంబంధించి నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు జైలు శిక్ష విధిస్తూ అనంతపురం స్పెషల్ జేఎఫ్‌సీఎం మొబైల్ కోర్టు న్యాయమూర్తి జె.సుజిన్‌కుమార్ తీర్పు వెలువరించారు. గార్లదిన్నె పోలీసుస్టేషన్ హౌస్ ఆఫీసర్ డాక్యానాయక్ తెలిపిన మేరకు... వివరాలు... గార్లదిన్నె మండలం కమలాపురం గ్రామానికి చెందిన చంద్రనారాయణ, సూర్యనారాయణ, బాలనారాయణ అన్నదమ్ములు. భూ వివాదం కారణంగా 2018, నవంబర్ 2న వీరు ఘర్షణ పడ్డారు. ఆ సమయంలో పరస్పర ఫిర్యాదుల మేరకు చంద్రనారాయణపై ఓ కేసు, సూర్యనారాయణ, బాలనారాయణ, భారతి (బాలనారాయణ భార్య)పై మరో కేసును అప్పటి ఎస్ఐ రామప్రసాద్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసుల వాదనలు కొనసాగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో చంద్రనారాయణకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా, అలాగే సూర్యనారాయణ, బాలనారాయణకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుజిన్‌కుమార్ బుధవారం తీర్పు వెలువరించారు. ఇదే కేసులో భారతికి రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ కేసుల్లో వాదనలను పీపీ హేమలత వినిపించారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లండి



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ బాబ్జీ



కార్యక్రమానికి హాజరవుతున్న వైద్యులు

- రోగులే గురువులు... వారికి మెరుగైన సేవలందించాలి
- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జీ
- సూపర్ స్పెషాలిటీలో ఘనంగా 2కే18 వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం
- డిగ్రీలు అందుకున్న వంద మంది విద్యార్థులు


అనంతపురం మెడికల్: ఎంతో గౌరవప్రదమైన వైద్య వృత్తిలో అడుగుపెడుతున్న వారందరూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జీ పిలుపునిచ్చారు. అనంతపురం వైద్య కళాశాల 2కే18 బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో ఘనంగా జరిగింది. డాక్టర్ కోరుకొండ బాబ్జీ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రణాళికతోనే రాణింపు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ బాబ్జీ మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగినప్పుడే వైద్య వృత్తిలో రాణింపు ఉంటుందన్నారు. ఫలితాలపై నిరుత్సాహం చెందకుండా ఒకటికి రెండు సార్లు ప్రయత్నిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఆస్పత్రుల్లో ఉండే రోగులనే ప్రథమ గురువులుగా భావించాలన్నారు. రోగుల సమస్యను ఓపికగా తెలుసుకుని, పరిష్కారం చూపించే క్రమంలో చేస్తున్న ప్రతి చికిత్స ఓ పరిశోధన కావాలన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఏర్పాటైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వివిధ రకాల రోగులకు అత్యుత్తమ వైద్యసేవలు అందుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడితో ఆగిపోకుండా వైద్య రంగంలో నిరంతర పరిశోధనలు సాగించాలని వైద్య విద్యార్థులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు, ప్రొఫెసర్లు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు సూచించారు.

తల్లిదండ్రుల గౌరవాన్ని కాపాడే స్థాయికి ఎదగాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ... చిన్నప్పటి నుంచి అన్ని విధాలుగా ఉన్నతికి పాటుపడిన తల్లిదండ్రుల గౌరవాన్ని కాపాడే స్థాయికి ఎదగాలని నూతనంగా వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తున్న వారికి సూచించారు. నచ్చిన స్పెషలైజేషన్ ఎంచుకుని అందులో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... యూజీ, పీజీ సీట్ల పెంపుతో పాటు నూతన కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుందన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు పీజీ సీటు దక్కించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలన్నారు. అనంతరం ఎంబీబీఎస్ పూర్తి చేసిన వంద మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ బాబ్జీను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షారోన్, డాక్టర్ నవీన్‌కుమార్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, సీనియర్ వైద్యులు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న వైద్య విద్యార్థి

నాకు నేనే స్ఫూర్తి



2013లో పదో తరగతి చదువుతున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుని వెన్నముక దెబ్బ తినింది. అందరూ నడవలేదని అనుకున్నారు. ఆ సమయంలో అమ్మ, నాన్న డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, హరితరెడ్డి ప్రోత్సాహంతో నాలో ఆత్మస్థైర్యం పెరిగింది. ఇవాళ నడిచే స్థాయికి చేరా. పట్టుదలతో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ఈ రోజు నడుచుకుంటూ స్టేజిపైకి వెళ్లి పట్టా తీసుకున్నా. నాకు నేనే స్ఫూర్తి. సైకియార్టీలో స్పెషలైజేషన్ చేయాలని ఉంది.

– డాక్టర్ హిమవర్షరెడ్డి, అనంతపురం

నాన్నే ఆదర్శం



మా నాన్న ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్. సుదీర్ఘకాలంగా జిల్లా ప్రజలకు ఎనలేని సేవలందించారు. మానసిక సమస్యలతో వచ్చిన వారికి ధైర్యం చెబుతూ చికిత్సనందించడాన్ని ఎన్నోసార్లు ప్రత్యక్షంగా చూశా. ఆయన స్ఫూర్తితోనే నేనూ వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తున్నా. సైకియార్టీలో స్పెషలైజేషన్ చేస్తా. అమ్మ విజయపద్మ ప్రోత్సాహం మరువలేను.

– డాక్టర్ యండ్లూరి చిద్విలాస్, అనంతపురం

మా కుటుంబంలో నేనే మొదటి డాక్టర్



నాన్న బన్సోత్ కుళ్లాయప్ప, అమ్మ సుభద్రబాయి. మాది వ్యవసాయ కుటుంబం. విద్యార్థి దశ నుంచే నన్ను డాక్టర్‌ను చేస్తామని అమ్మ, నాన్న తరచూ చెప్పేవారు. వారి ఆశయం మేరకు వైద్య వృత్తి చేపట్టాలని నిర్ణయించుకుని ఆ దిశగా శ్రమించాను. ఎంబీబీఎస్ చదివే రోజుల్లోనే వివాహం జరిగింది. కానీ ఏనాడు ఇబ్బంది పడలేదు. భర్త లక్ష్మణ్, తల్లిదండ్రుల పోత్సహంతో ఎంబీబీఎస్ పూర్తి చేశా. మా కుటుంబంలో నేనే మొదటి డాక్టర్‌ని. రేడియాలజిస్టు కావాలన్నదే లక్ష్యం.

– డాక్టర్ బన్సోత్ కుళ్లాయమ్మ, ఆర్ఎస్ తండా, ముదిగుబ్బ





పట్టా అందుకున్న కుమార్తెను ముద్దాడుతున్న తల్లి, డాక్టరేట్ పట్టా అందజేస్తున్న వీసీ బాబ్జీ, ముఖ్యఅతిథులు



అందుకున్న పట్టాలు చూపిస్తున్న వైద్యులు



కార్యక్రమాన్ని తిలకిస్తున్న కుటుంబసభ్యులు

రేపటి నుంచి జరుట్ల రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు





జరుట్లరామలింగేశ్వరస్వామి మూలవిరాట్, ముస్తాబైన ఆలయం

వజ్రకరూరు: మండలంలోని జరుట్ల రాంపురంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 8న ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం ఆలయంలో విశేష పూజలు, కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. అదే రోజు అర్ధరాత్రి 12 గంటలకు ఆదిదంపతుల కల్యాణోత్సవం ఉంటుంది. శనివారం ఉదయం విశేష అభిషేకాలు, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ క్రమంలో ఉత్సవ ఏర్పాట్లను ఈఓ కృష్ణయ్య, అర్చకులు, సిబ్బంది బుధవారం పరిశీలించారు.

అభివృద్ధి చేసి చూపించాం

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలి
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ
- అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో ప్రచారం ప్రారంభం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు

రాప్తాడురూరల్: దశాబ్దాలుగా వెనుకబడిన రాప్తాడు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపించామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మతో కలసి అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో ఆయన ఎన్నికల శంఖారావం పూరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వైటీ శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.30 లక్షల నిధులతో తాటిచెర్ల రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపు పనులు కూడా ప్రారంభమవుతాయన్నారు. తాటిచెర్ల చెరువుకు నీళ్ల తీసుకొచ్చే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ.65 లక్షల దాకా ఖర్చవుతుందన్నారు. ప్రభుత్వం నుంచి ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే ఈ మొత్తాన్ని గ్రామపెద్దల చేతుల్లో పెట్టి ఎన్నికలకు వెళతామని ప్రకటించారు.

పరిటాల సునీత చేసిందేమీ లేదు..

పదేళ్ల పాటు ఈ ప్రాంతానికి పరిటాల సునీత ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసినా ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. 2019 ఎన్నికల్లో తాను గెలిచిన తర్వాత నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా 17 వేల ఇళ్లను మంజూరు చేయించామన్నారు. 2 వేలమంది పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయించామన్నారు. 4 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించేందుకు గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 11.50 ఎకరాల భూములు కేటాయించామన్నారు. ఆరు నెలల్లో ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కూడా పూర్తవుతాయన్నారు. నియోజకవర్గంలోని పాడి మహిళా రైతులకు అండగా నిలుస్తూ రూ.20 కోట్ల సొంత నిధులతో అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామన్నారు. పేరూరు డ్యాంకు నీళ్ల విడుదల చేయించడంతో పాటు రామగిరిలోని బంగారు గనులను తెరిపిస్తున్నామన్నారు. రూ.1,500 కోట్లతో 300 మెగావాట్ల సోలార్ హైబ్రీడ్ పవర్ ప్లాంట్ తీసుకొచ్చామన్నారు. నియోజకవర్గంలో రూ.5 వేల కోట్లతో 1,050 మెగావాట్ల సోలార్ ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. అనంతపురం రూరల్ మండలంలో 7 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. మంత్రిగా పని చేసిన పరిటాల సునీత తాటిచెర్ల గ్రామానికి కనీసం 14 ఇళ్లు తీసుకురాలేదన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఆశీర్వదించాలని కోరారు.

చంద్రబాబును నమ్మొద్దు

చంద్రబాబు వస్తే కరువు వస్తుందనేది చాలామార్లు రుజువైందన్నారు. అలాంటి బాబును నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్లు మఠం శ్యాంసుందర్, జయచంద్రారెడ్డి, యూత్ మండల కన్వీనర్లు కిరణ్ కుమార్‌రెడ్డి, తాడిపత్రి శీనా, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తు చూపుతున్న ప్రకాష్‌రెడ్డి

సార్వత్రిక ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించండి


- మీడియాకు కలెక్టర్ గౌతమి సూచన
- యంత్రాంగానికి సహాయసహకారాలు అందించాలని సూచన

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని మీడియా ప్రతినిధులకు కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగిలే జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మీడియా ప్రతినిధులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో మీడియా పోషించాల్సిన పాత్రను వివరించారు. ప్రజలకు సరైన సమాచారాన్ని అందించాలన్నారు. ఎన్నికల సన్నద్ధత, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, తదితర అంశాలపై ప్రజలను చైతన్యపరిచేలా కథనాలు ప్రచురించాలన్నారు.

ఎంసీఎంసీ కమిటీ : పెయిడ్ న్యూస్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ చేసిన సూచనలు వివరించారు. ఇందు కోసం ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిటీకి నోడల్ అధికారి ఉంటారన్నారు. కమిటీ సర్టిఫికేషన్ అనంతరం డీఐపీఆర్ఓ నిర్ణయించిన ధరకు అనుగుణంగా పెయిడ్ న్యూస్ ప్రచురించాలన్నారు.

ఫేక్ న్యూస్ వ్యాప్తి వద్దు : ఏదైనా వార్తను ప్రచురించే ముందు ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకోవాలన్నారు. వాస్తవం అని నిర్ధారించుకున్న తర్వాతనే ప్రచురించాలన్నారు. ఫేక్ న్యూస్‌లను వ్యాప్తి చేయకుండా ముఖ్య భూమిక పోషించాలన్నారు. రాజకీయ ప్రకటనలు, సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సినిమా హాళ్లలో ప్రకటనలు, ఈ–పేపర్లు, రేడియోలో ప్రకటనలకు సంబంధించి ముందుగా ఎంసీఎంసీ ధ్రువీకరణ పొందిన తరువాతేనే ప్రచురించడం, ప్రసారం చేయడం జరగాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అందరూ పాటించాలన్నారు. ఎంసీఎంసీ, ప్రీ సర్టిఫికేషన్ ఆఫ్ యాడ్స్, పెయిడ్ న్యూస్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ బసవరాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఐపీఆర్ఓ గురుస్వామిశెట్టి, మాస్టర్ ట్రైనర్లు డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడి, ఉద్యానశాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి కుష్బూ కొఠారి, రేడియో ప్రోగ్రాం అధికారి నాగేశ్వరరెడ్డి, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ పని చేస్తోందని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం సమకూర్చిన 12 సీటర్ వాహనాన్ని బుధవారం ప్రశాంతి నిలయంలోని గణేష్ గేట్ వద్ద ఆయన ప్రారంభించారు. ఇప్పటికే ప్రశాంతి నిలయంలో ఇదే తరహాకు చెందిన 3 వాహనాలు పనిచేస్తున్నాయి. తాజాగా మరో వాహనాన్ని సమకూర్చారు. ఈ వాహనాల్లో భక్తులను ప్రశాంతినిలయంలో ఓ చోటు నుంచి మరో చోటుకు తరలించేందుకు వినియోగిస్తున్నారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రాజు మాట్లాడుతూ... వృద్ధులు, దివ్యాంగులు, మహిళలను ఓ చోటు నుంచి మరో చోటుకు సులువుగా తీసుకెళ్లేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.

చిట్టీల నిర్వాహకుడిపై ఫిర్యాదు



పోలీసు స్టేషన్ ఆవరణలో కూర్చొన్న బాధితులు

గుంతకల్లు రూరల్: చిట్టీల డబ్బు కాజేసి అజ్ఞాతంలోకి వెళ్లిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బుధవారం ఉదయం బాధితులు కసాపురం పోలీస్ స్టేషన్‌కు బారులు తీరారు. వివరాలు... స్థానిక డీఆర్ఎం కార్యాలయం ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న క్రిష్టఫర్ తన భార్య సుకన్యతో కలసి శంకరానందగిరీ డిగ్రీ కళాశాల సమీపంలోని మిలిటరీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సొంతంగా ఇల్లు నిర్మించుకుని కొన్నేళ్లుగా అక్కడే ఉంటున్న క్రిష్టఫర్ కొంత కాలంగా తన భార్య పేరున చిట్టీలు నడపడం మొదలు పెట్టాడు. చిట్టీ పూర్తయిన తర్వాత డబ్బు తీసుకునే సభ్యుల వద్ద ఆ డబ్బును వడ్డీకి తీసుకుని అవతలి వారు అవసరమైనప్పుడు వెంటనే తిరిగి ఇస్తూ నమ్మకం పెంచుకున్నాడు. డబ్బు తీసుకున్న వారికి చెక్‌లు, ప్రామిసరీ నోట్లు రాసిస్తూ మొత్తం లావాదేవీలను సుకన్య పేరు మీదే నిర్వహిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో కొన్ని నెలలుగా చిట్టీ డబ్బు సక్రమంగా ఇవ్వకపోవడంతో బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఇటీవల తాము నివాసముంటున్న ఇంటిని కూడా ఇతరులకు క్రిష్టఫర్ దంపతులు విక్రయించినట్లుగా సమాచారం. మంగళవారం రాత్రి క్రిష్టఫర్ ఇంటి నుంచి ఫర్నీచర్‌ను తరలిస్తున్న విషయాన్ని గమనించిన బాధితులు ఒకరి తర్వాత ఒకరు వెంటనే కసాపురం పోలీసులకు ఫోన్ చేసి తమకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఫర్నీచర్ తరలింపును అడ్డుకుని ఇంటికి తాళం వేసి, తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అంతకు ముందే క్రిష్టఫర్ దంపతులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచే బాధితులు కసాపురం పోలీస్ స్టేషన్‌కు క్యూ కట్టారు. దాదాపు 50 మంది నుంచి రూ.5 కోట్ల వరకూ క్రిష్టఫర్ దంపతులు తీసుకున్నట్లు బాధితులు వాపోతున్నారు.

జీవనోపాధుల పెంపునకే 'విశ్వకర్మ యోజన'

పుట్టపర్తి అర్బన్: చేతివృత్తులపై ఆధారపడిన వారి జీవనోపాధుల పెంపునకే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని శ్రీసత్యసాయి జిల్లా డీఆర్‌డీఏ పీడీ నరసయ్య అన్నారు. విశ్వకర్మ యోజనపై పుట్టపర్తిలోని ఆర్‌వీ జానకీరామయ్య కల్యాణ మంటపంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కులమతాలతో సంబంధం లేకుండా చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడమే కాక, జీవనోపాధులు కల్పించేలా యోజన పథకానికి రూపకల్పన చేశారన్నారు. 18 సంవత్సరాలు పైబడిన స్వయం సహాయక సంఘాల మహిళలు, సంప్రదాయ చేతివృత్తిదారులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారికి 7 నుంచి 15 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో రూ.500 స్టైయిఫండ్ చెల్లిస్తారన్నారు. అనంతరం పనిముట్ల కొనుగోలుకు రూ.15వేలు, తొలి విడతలో రూ.1లక్ష రుణం అందజేస్తారన్నారు. కంతులు సక్రమంగా చెల్లిస్తే రూ.3 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పిస్తామన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నిజరూప పాదదర్శనం



అలంకరణలో రుక్మిణీ విఠల పాండురంగడు

అనంతపురం కల్చరల్: నగరంలోని రామనగర్ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో బుధవారం విజయ ఏకాదశి సందర్భంగా రుక్మిణీ విఠల పాండురంగ నిజరూప పాదదర్శనం భక్తిశ్రద్ధలతో జరిగింది. భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఉదయం జరిగిన నిజరూప పాదదర్శనంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని ఆరాధించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి దుస్తకర్ తిరుపతిరావు, సెక్రటరీ ఆనంద్ మహేంద్రకర్ మాట్లాడారు. ప్రతి ఏకాదశికి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కల్గిస్తున్నట్లు తెలిపారు. మహామంగళ హారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



జ్యోతులతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: రామాయణ రచయిత, వాల్మీకుల ఆరాధ్య దైవం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని గురువారం ఆత్మకూరులో ప్రతిష్ఠించనున్నారు. వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా బుధవారం వాల్మీకి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు ప్రతి ఇంటి నుంచి కలశాలతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు.


ఓటు విలువ తెలుసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

ఆత్మకూరు: దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉంది. ఏం సాధించాలన్నా ప్రయోజకులు కావాలన్నా మరొకరికి ఆదర్శంగా నిలవాలన్నా యువతతోనే సాధ్యమని తహసీల్దార్ పరమేశ్వర స్వామి అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగంపై ఇంట్లో వారికి, బంధువులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు పదో తరగతి మార్కుల జాబితా, ఇంటి అడ్రస్, ఆధార్ తప్పనిసరిగా ఉండాలన్నారు.


పుస్తకం తరాల మధ్య వారధి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి

అనంతపురం: మంచి పుస్తకం తరాల మధ్య వారధిలా ఉండి మార్గనిర్దేశం చేస్తుందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎస్కేయూలోని కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ, పీడీఆర్ (ఐసీఎస్ఎస్ఆర్) పూర్తి చేసిన డాక్టర్ వై.నాగేంద్ర రెడ్డి రచించిన 'కస్టమర్ సాటిస్ఫ్యాక్షన్ ఇన్ లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణ కుమారి, ఎం.ఆదినారాయణ (హంపాపురం), మల్లిరెడ్డి ఆయన్ను అభినందించారు.

జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర

అనంతపురం: పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 5వ తేదీన రెయిన్ 4 జెడ్-2కే24 అనే సాంకేతిక జాతీయ సదస్సు జరిగింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎస్ఏ రిజ్వాన్, జి. హన్మర్‌స్వామి, ఏ. తన్మయి జాతీయ సదస్సులో సత్తా చాటి రెండో స్థానం దక్కించుకున్నారు. ఇందులో ప్రతిభ చాటిన ఎస్కేయూ విద్యార్థులను ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర అభినందించారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

- గతంలో ప్రజాప్రతినిధులు ఇళ్ల వద్దకు వచ్చి సమస్యలు విన్నారా?
- వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపు
- 2వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో గడప గడపకూ మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్, వై ఏపీ నీడ్స్ జగన్, ఇప్పుడు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ, తదితర కార్యక్రమాల పేరుతో మీ ఇంటి వద్దకు వచ్చాం. ప్రజలకు అందుతున్న సంక్షేమంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపాం. గతంలో ఉన్న ప్రజాప్రతినిధులు ఇన్నిసార్లు ఇళ్ల వద్దకు రాలేదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రజలకు తెలియజేశారు. బుధవారం నగరంలోని 2వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటి వద్దకే వెళ్లి సంక్షేమంలో ఏమైనా జాప్యం జరిగితే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపామన్నారు. సాంకేతికంగా నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ముఖ్యంగా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. తద్వారా రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించడం జరిగిందన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పేరుతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. వీటితో పాటు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పథకాలు వర్తించేందుకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందించినట్లు వెల్లడించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట..

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి.. అనారోగ్య సమస్యలున్న వారిని వైద్య శిబిరాలకు పంపడం జరిగిందన్నారు. అక్కడ స్పెషలిస్టు వైద్యులకు చూపించి జిల్లా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేయడం జరిగిందన్నారు. తద్వారా వేలాది మంది బీపీ, షుగర్, తదితర సమస్యలున్న వారు బయటపడ్డారన్నారు. దీంతో పాటుగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసినట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి వద్దకే వైద్యులు వెళ్లేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజలకు సంక్షేమం ఇవ్వడంతో పాటు వారు ఆరోగ్యంగా జీవించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ విధంగా గతంలో ఏ ప్రభుత్వాలు ప్రజలకు అండగా నిలిచాయో మీరో ఆలోచించుకోవాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రభుత్వమన్నారు. ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచే సమయం ఆసన్నమైందన్నారు. మరో 45 రోజుల్లో ఎన్నికలు రానున్నాయని.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు.

రూ.1,045 కోట్లతో అభివృద్ధి..

గత ప్రభుత్వంలో కంటే భిన్నంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో రూ.1,045 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న రోజుల్లోనూ మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్, కార్పొరేటర్లు బోయ నాగమణి, సుమతి, లక్ష్మి, దేవి, బాలాంజినేయులు, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి, లక్ష్మణ్ణ, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, లింగాల రమేష్, మన్నల సత్యనారాయణ, బోయ రవి, రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణ, కృష్ణమూర్తి, రామయ్య, సుహాసిని, సుజాతరెడ్డి, అంజలి, గౌరి, పల్లవి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో ప్రతిభ

అనంతపురం: మద్రాస్ వర్సిటీలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కవిత్రయ-మహాభారతం-వర్తమాన సమాజం: సమాలోచన' అనే అంశంపై మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీకి చెందిన తెలుగు విభాగం విద్యార్థిని సాకే హరిభక్తభానుశ్రీ నగదు బహుమతి అందుకుంది . ఈ సందర్భంగా ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ డీన్ ప్రొఫెసర్ సి.షీలా రెడ్డి, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ గరికపాటి గురుజాడ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

మ్యూజియం ప్రారంభోత్సవం వాయిదా

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలో సుందరంగా నిర్మించబడిన మ్యూజియంను (పురావస్తుశాఖ భవంతి) ముందుగా నిర్ణయించుకున్నట్లు ఈనెల 8న కాకుండా 11న ప్రారంభిస్తున్నట్లు మ్యూజియం ఏడీ రజిత తెలిపారు. అనివార్య కారణాల వల్ల ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నామని సోమవారం పర్యాటక శాఖామంత్రి రోజా చేతుల మీదుగా అధునాతన భవంతిని ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

నేడు 43వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 43వ డివిజన్‌లో గురువారం ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ రోడ్డు నడిమివంక నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

నేడు సచివాలయ ప్రారంభోత్సవం

కనగానపల్లి: మండల పరిధిలోని తగరకుంటలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభిస్తారని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. అలాగే స్థానిక బస్టాండ్ సర్కిల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కస్తారని ఎంపీటీసీ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ(ఏ) వీసీ జీవీఆర్ శ్రీనివాస రావు

అనంతపురం: యువత రాజకీయాల్లోకి రావాలి. చట్ట సభల్లో ప్రాతినిథ్యం వహించి దేశాభివృద్ధికి పాటుపడాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'జిల్లాస్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్' కార్యక్రమాన్ని బుధవారం జేఎన్‌టీయూలో నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. కేవలం వృత్తిపరమైన విద్యనే కాకుండా, దేశ రాజకీయాల్లోనూ యువత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో వికసిత్ భారత్, ఆత్మ నిర్భర భారత్, ఏషియన్ గేమ్స్‌లో భారత్ సాధించిన పతకాలు, విదేశాంగ విధానం, చంద్రయాన్, అంశాలపై విద్యార్థులు చర్చించారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతీ, యువకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఏఎస్పీ మల్లిఖార్జున వర్మ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీఎన్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, డాక్టర్ టి.నారాయణ రెడ్డి, ఎన్వైకే ఇంచార్జి శ్రీనివాసులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాతి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ఇంచార్జి డాక్టర్ వరలక్ష్మి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్ నారాయణ, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో దేశ సమగ్రాభివృద్ధి



'ఫిలాసఫీ ఆఫ్ ఇండియన్ ఎడ్యుకేషన్ అండ్ గాంధీయన్ పర్స్‌పెక్టివ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ హుస్సేన్ రెడ్డి

అనంతపురం: మహిళా సాధికారితతో దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల ముందుగానే కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణకుమారి అధ్యక్షత వహించారు. సదస్సు కన్వీనర్‌గా ప్రొఫెసర్ జి. శోభా లత వ్యవహరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఎంతో మంది ఉన్నత స్థానాలను అధిరోహించిన శక్తివంతమైన మహిళల గురించి వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఆయా కంపెనీలను నిర్వహించి అగ్రగామిగా నిలిచిన వారి వివరాలను తెలియజేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎన్ శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళా రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నిరోధం, భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 14, 15 గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ముని నారాయణప్ప, డాక్టర్ కే. అనిత, ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ పాల్గొన్నారు. మహిళా దినోత్సవ సదస్సు సందర్భంగా డాక్టర్ ఎన్. కల్పనా కుమారి (రీసెర్చ్ అసిస్టెంట్, మహిళా అధ్యయన కేంద్రం) 'ఫిలాసఫీ ఆఫ్ ఇండియన్ ఎడ్యుకేషన్ అండ్ గాంధీయన్ పర్స్‌పెక్టివ్స్ ' అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథాన్ని వీసీ ఆవిష్కరించారు.

రైతు ఆదాయం పెరిగేలా సహకరించండి



ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: రైతుల ఆదాయం పెరిగేలా అవసరమైన ఇన్‌పుట్స్ అందించి సహకరించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం స్థానిక కృషిభవన్‌లో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) కింద ఒక సంవత్సరం డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న డీలర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కోర్సు ప్రోగ్రాం కన్సల్టెంట్, విశ్రాంత కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.లక్ష్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఏఓ మాట్లాడారు. వ్యవసాయశాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందించడంలో డీలర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సరైన సలహాలు, సూచనలతో పాటు వారిపై అవనసరంగా ఆర్థికభారం మోపకుండా ఏవి అవసరమో వాటినే ఇవ్వాలన్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతిమంగా రైతుకు ప్రయోజనం కలిగేలా వ్యవసాయశాఖ, డీలర్లు బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. బద్ధశత్రువైనా అనారోగ్యంతో ఆసుపత్రికి వస్తే ప్రాణాలు కాపాడేందుకే వైద్యులు ప్రయత్నిస్తారని, అలాగే రైతుల మేలు కోరి డీలర్లు సహకరించాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. సమావేశంలో ఆత్మ పీడీ ఎంసీ మద్దిలేటి, అనంతపురం ఏడీఏ ఎం.రవి, అనంతపురం పరిసర పది మండలాలకు చెందిన 40 మంది డీలర్లు పాల్గొన్నారు.

పరిశోధనలు కొనసాగాలి



డాక్టర్ జే.శ్రీనివాసులును సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: ఎంత వినియోగించినా, తరగని పునరుత్పాదక ఇంధన వనరుల లభ్యతపై పరిశోధనలు కొనసాగాలని జేఎన్‌టీయూ అనంతపురం ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జే.శ్రీనివాసులు అన్నారు. అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు ఎలక్ట్రికల్ విభాగంలో 'ఎలక్ట్రో-ఫ్యాడ్ 2కే24' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అనంత రాముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామ్మూర్తి, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

8న జాగరణ మహోత్సవం

అనంతపురం కల్చరల్: అనంత శివారాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 8న మూడవ రోడ్డులోని జీఆర్ పంక్షన్ హాల్‌లో మహాశివరాత్రి జాగరణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు గొంగడిరామప్ప, అనంత పద్మనాభ, పాలసముద్రం నాగరాజు తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. శుక్రవారం ఉదయం నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కాశీవిశ్వేశ్వర లింగానికి సామూహిక జలాభిషేకాలు, ఆధ్యాత్మిక భక్తిగీతమాల, శాస్త్రీయ నృత్యాలతో భక్తినీరాజనం తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులందరూ జాగరణలో పాల్గొనాలని కోరారు.

బాలయోగి ఆశ్రమ మహాద్వారాలు ప్రారంభం



శివబాలయోగి మహారాజ్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి మహారాజ్ ఆశ్రమానికి తూర్పు, పడమరల్లో నూతనంగా నిర్మించిన మహా ద్వారాలను బుధవారం ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు అరవింద్, దేవరాజ్ మాట్లాడుతూ ఓలేటి ప్రసన్నలక్ష్మి, పురుషోత్తం, విజయలక్ష్మి, తాయి వీరభద్రయ్య అనే భక్తులు వెండి కవచాలు, మహాద్వారాల నిర్మాణాలకు సహకారమందించారని తెలిపారు. ఆలయంలో శివరాత్రి వేడుకలు ఈసారి మరింత ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జీవీ లక్ష్మయ్య, మల్లికార్జున, కృష్ణరంగయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి ఇన్‌పుట్ సబ్సిడీ

కనగానపల్లి: 2023 ఖరీఫ్ పంట నష్టపరిహారం కింద మండలానికి రూ. 9.58 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైనట్లు ధర్మవరం ఏడీఏ కిష్టయ్య బుధవారం తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలోనే అత్యధికంగా కనగానపల్లి మండలంలోని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పరిహారం అందుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 7,067 హెక్టర్లలో సాగు చేసిన పంటలకు సంబంధించి 4,910 మంది రైతుల ఖాతాల్లో పరిహారం జమ అవుతుందన్నారు. ఇందులో అత్యధికంగా పత్తి, వేరుశనగ పంటలకు హెక్టారుకు రూ.17,000 చొప్పున, మొక్కజొన్నకు రూ.12,500, కందికి రూ.10,000, ఆముదం పంటకు రూ.8500 ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైనట్లు తెలిపారు.

రూ.7.91 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు

ఆత్మకూరు: మండలానికి సంబంధించి ఎనిమిది రెవెన్యూ గ్రామాలకు రూ.7,91,27,352 పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి సుచరిత బుధవారం తెలిపారు. మండలంలో 6,575 హెక్టార్లలో 5,507 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చిందన్నారు. ఆత్మకూరులో 2,284, బి.యాలేరులో 82, మదిగుబ్బలో 137, గొరిదిండ్లలో 962, పి.యాలేరులో 1,058, సనపలో 474, తలుపూరులో 396, తోపుదుర్తి 684 మంది రైతులకు పరిహారం అందుతుందని పేర్కొన్నారు. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, జొన్నలు, కొర్రలు, పెసర పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరైందన్నారు.

టీడీపీ నేతల ఫొటోలతో ఆర్టీసీ ఉద్యోగుల ఫ్లెక్సీలు

అనంతపురం క్రైం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో టీడీపీ నేతల పేర్లు, ఫొటోలతో ఏపీపీటీడీ కార్మిక పరిషత్ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోడానికి ఎలాంటి అనుమతులు లేవు. పైగా యూనియన్ కూడా గుర్తింపు లేక పోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరినా పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ ఉద్యోగుల ఫొటోలతో వెలసిన ఫ్లెక్సీని తక్షణం తొలగించాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ ఆర్ఎంను సంప్రదించగా.. అలా వేయడానికి లేదు. ఈ విషయంపై డీఎంకు కూడా ఆదేశాలు జారీ చేశామన్నారు.

కైలాస వాహనంపై ఆదిదంపతుల దర్శనం

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆదిదంపతులైన కాశీవిశ్వేశ్వరుడు, అన్నపూర్ణ దేవి కైలాస వాహనంపై ఊరేగి దర్శనమిచ్చారు. ఉదయం దీక్షాహోమం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామూహిక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీసాయి నృత్యాలయం నాట్యాచార్యులు పద్మావతి శిష్యబృందం కూచిపూడి నాట్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు, అన్నపూర్ణ దేవి



పురవీధుల్లో ఊరేగుతున్న దేవదేవుడు

వేపచెర్లలో ఉచిత వైద్య శిబిరం

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. వేపచెర్ల, వేపచెర్ల దిగువ తండా, వేపచెర్ల ఎగువ తండా గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు డాక్టర్ సబిహా సుల్తానా తెలిపారు. రక్తశాత పరీక్షలు, బీపీ, షుగర్, జ్వరాలు ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం కంటి సమస్యలు ఉన్న వారికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు.

ఉద్యానశాఖ అధికారికి సన్మానం



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా ఉద్యానశాఖ అధికారిగా పని చేస్తూ పదోన్నతిపై ఏపీఎంఐపీ పీడీగా నియమితులైన బి.రఘునాథరెడ్డిని ఉద్యానశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యోగులందరూ శాలువా, మెమెంటోలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ ఏడీ నరసింహారావు, సూపరింటెండెంట్లు భాషా, వరప్రసాద్, టెక్నికల్ హెచ్ఓలు పల్లవి, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అశ్వత్థంలో నాటక ప్రదర్శన

పెద్దపప్పూరు: చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా సీనియర్ రంగస్థల కళాకారులతో రంగస్థల నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.